


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



-86-

# బందీ బతుకులు

"ఓమ్మే భాగ్యా తొందరగా ఇటరా. ఇండియానుండి జాబొచ్చింది చూడు".

మసిబూసి చెయ్యాలని కోడిని కడుగుతున్న భాగ్య చేతులు కడుక్కుని గబగబా వచ్చింది.

"ఎవరు రాసినారో ఏమో." జాబును తిప్పి తిప్పి చూస్తూ చెప్పింది సుబ్బలక్ష్మి.

ఆత్రుతగా అందుకుని విప్పి చూసి, "తూర్పు వీధిలో వుండే మా మేనమామ మేనత్త రాసినారు. రెండు లక్షలు అప్పుచేసి కూతురికి పెళ్ళి చేస్తే వాళ్ళు పెట్టే బాధలు పడలేక ఆర్నెల్లకే అత్తగారింట్లో ప్రాణం తీసుకునిందంట పిల్ల. కొడుకు వేణు గాడేమో చెప్పినమాట వినకుండా అల్లరి చిల్లరగా తిరుగుతున్నాడు. బిడ్డ చచ్చిపోయిన  బాధ ఒకటయితే ఊర్లో కొడుకు చేసే పనులు ఇంకా తలకాయనొప్పిగా వున్నాయంట. వాడ్ని కొయేటికన్నా పంపిస్తే అక్కడ భయం భక్తిగా బతుకుతాడు. ఇక్కడే ఊర్లో వుంటే పూర్తిగా చెడిపోతాడని మనల్ని వీసా తీయమని జాబు రాసినారు. ఏంటో వీళ్ళ బాధలు వింటా వుంటే గుండె చెరువైపోతాంది" నిట్టూర్చింది భాగ్య.

"అయ్యో.. బంగారంలాంటి పిల్ల. రిగ్గు కాడికి నీళ్ళకు పోతే పిన్నీ నువ్వు ముందు పట్టుకో అని తన వంతు నాకిచ్చి నా బిందెలన్నీ నింపేది. కూరో నారో వాళ్ళమ్మ చూడకుండా గోడమీదనుంచి గిన్నెతో నాకు అందించేది. నేను కోయేటికి వచ్చేటప్పుడు బస్సు ఎక్కతావుంటే మళ్ళా నిన్ను ఎప్పుడు చూస్తానో పిన్నీ అంటూ మీదబడి ఏడ్చింది. కొయేటి నుంచి ఏమి తీసుకొచ్చేదమ్మీ అంటే నాకు జపాన్ చీర తీసకరా పిన్నీ అనిందమ్మా బిడ్డ. ఏమి కష్టమొచ్చిందో ఏమో పద్దెనిమిదేళ్ళకే అన్యాయంగా ప్రాణం తీసుకుందే ఆ పిల్ల. పోయిన ప్రాణం మళ్ళా రాదు కదా" బాధతో కళ్ళలో నీళ్ళు నింపుకుంది సుబ్బలక్ష్మి.

"నిజమేనబ్బా.. నిమ్మపండులాంటి వళ్ళు, గుండ్రటి మొహం, బారెడు జడతో దేవకన్య లాగా వుండేది. ఆ పిల్లను

తలచుకుంటే గుండెల్లో బాధగా వుంది." మేనమామ కూతుర్ని తలచుకుని ఏడ్చింది భాగ్య.

భాగ్య వాళ్ళ ఊరే సుబ్బలక్ష్మిది కూడా. వరసకు అక్క అవుతుంది. సంవత్సరం క్రితం భాగ్యే వీసా పంపిస్తే అదే ఇంట్లో పని చేయడానికి వచ్చింది సుబ్బలక్ష్మి. ఒకే ఊరోళ్ళు, ఒకే భాష వచ్చిన వాళ్ళు, ఒకే కుటుంబానికి చెందిన వాళ్ళు పరదేశంలో ఒక చోట పని చెయ్యడం అరుదు. అలా ఇద్దరూ కలిసి పనిపాటలు పంచుకోవడం అదృష్టమే.

ఆ రోజు సాయంత్రమే పిల్లగాడు వేణు వీసా గురించి మామాతో మాట్లాడినారు.

మొదట తోటపని చెయ్యడానికి రమ్మని, పని చూసిన తరువాత డ్రైవర్ గా పెట్టుకుంటానని చెప్పింది మామా.

సరేనని సంతోషంగా ఇంటికి ఫోన్ చేసి అదే విషయాన్ని మాట్లాడి వేణును తొందరగా డ్రైవింగ్ నేర్చుకోమని చెప్పారు. వాడు విమానం ఎక్కాలనే ఉబలాటంలో వున్నాడు కాబట్టి అప్పటికే డ్రైవింగ్ నేర్చుకున్నాడట.

అయితే తొందరగా పాస్పోర్ట్ కాపీలూ, డ్రైవింగ్ లైసెన్సు కాపీలు పంపించమని వీళ్ళు చెప్పారు.

ఇక్కడ ఇద్దరు పిన్నిలు అండగా వుండగా భయం ఏముంది. అన్ని పనులూ పూర్తయి అనుకున్న గడువు కంటే ముందే కువైట్ లో విమానం దిగాడు వేణు. భాగ్య, సుబ్బలక్ష్మి వాడికి పని నేర్పించారు. అక్కడి పద్ధతులన్నీ వివరించారు. వాడికి ఏ కొరతా లేకుండా వసతిని సమకూర్చారు.భాష వచ్చేంత వరకూ మామా బాబాలకు వీళ్ళే దుబాసీలు. వీళ్ళిద్దరూ ముందునుండీ నమ్మకంగా వున్నారు కాబట్టి వేణు వాళ్ళ బంధువే కాబట్టి వేణును కూడా కువైట్ వాళ్ళు బాగా నమ్మారు. ఒక్కసారి కువైట్ వాళ్ళకు నమ్మకం కుదిరితే ఇక వెనుదిరిగి చూడరు.

వాడికొక రూము అందులో టివితో పాటూ అన్ని వసతులనూ సమకూర్చారు. మూడుపూటలా మంచి తిండి. మూడ్నెల్లలో దొరబాబులా తయారయ్యాడు వాడు. మాట, పద్ధతి, స్టైల్ మారిపోయాయి.

మామా.. కొత్త ఆడి కారును వాడికిచ్చి పిల్లలను స్కూల్ కు తీసుకెళ్ళి తిరిగి ఇంటికి తీసుకొచ్చే బాధ్యతను అప్పగించింది.

కారును చూసి సంతోషించాడు వేణు. ఒక సంవత్సరం పాటూ మామా బాబా ఏది చెబితే అది విన్నాడు. కాలితో పని చెబితే చేత్తో చేసాడు. నమ్మకాన్ని బాగా సంపాదించుకున్నాడు.

ఊళ్ళో అల్లరి చిల్లరగా తిరిగి తలనొప్పిగా మారిన కుర్రాడు కువైట్ వచ్చి బాగుపడ్డాడు, అంతా మీ పుణ్యమే అంటూ భాగ్య మేనమామ సంతోషంగా కువైట్ కి ఉత్తరం రాసాడు. ఒకరోజు.. వచ్చి వంటింట్లో కూర్చుని ఇరానీ కుబూస్ (రొట్టె) చీజ్ తింటూ, "పిన్నీ వీళ్ళిచ్చే జీతం ఏమి సరిపోతుంది. ఎన్నేళ్ళు పని చేసినా ఇల్లు కట్టగలనా? పెళ్ళి చేసుకోగలనా? అందుకే బయట ఏదైనా కంపెనీలో ఉద్యోగం అయితే లక్షలు సంపాదించవచ్చు. ఇక్కడ కువైట్ ఇంట్లో జీవితాంతం ఈ చాకిరీ ఎవడు చేస్తాడు. స్వేచ్ఛలేకుండా బతకడం కష్టంగా వుంది. మీరు

మామా బాబాను రిలీజు అడగండి నేను బయట పని చూసుకుంటాను" అని రొద పెట్టాడు వేణు.

"వద్దురా నువు వచ్చి సంవత్సరమైనా కాలేదు. కనీసం వీసా గడువు తీరే వరకూ పని చెయ్యాలి కదా. రెండేళ్ళు జరగనీ తరువాత చూద్దాం" అని నచ్చచెప్పారు వీళ్ళు. నవ్వాడు వాడు.

రోజూ పిల్లలను స్కూల్ కి తీసుకెళ్ళేవాడు. సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకొచ్చే వాడు. మధ్యలో కనబడేవాడు కాదు. రోజంతా ఎక్కడ తిరుగుతున్నాడో ఏమో. మామా బాబాకు తెలిస్తే తంతారు. ఆ విషయమే వాడిని అడిగింది భాగ్య. "మగాడన్నాక లక్ష పనులు వుంటాయి. ఏదో ఒకటి చేసి తొందరగా డబ్బు సంపాదించాలి కదా" తల ఎగరేసాడు వాడు.

ఎందుకో వాడి మాట, పద్ధతి భాగ్యకు నచ్చలేదు. ఇది పరదేశమని కాస్త తేడా వస్తే తోలు తీస్తారని భయం చెప్పింది.

"అంత సీను లేదులే.. వేణు అంటే ఏమనుకున్నావు. నా తెలివితో కోట్లు సంపాదించి చూపిస్తా" అంటూ నవ్వాడు వాడు.

"కోట్లా.. ఎలారా..?" అడిగింది సుబ్బలక్ష్మి.

"చెప్పను. చేసి చూపిస్తా" అన్నాడు వాడు.

ఎందుకో వాడి మాటలు భయాన్ని కలిగించాయి

ఒకరోజు స్కూల్ అయ్యాక పిల్లలను ఇంట్లో దించేసి కారేసుకుని పోయాడు. రాత్రవుతున్నా ఇంటికి తిరిగి రాలేదు. మామా బాబా కూడా వేణు ఎక్కడని అడిగారు.

ఏం చెప్పాలో అర్థం కాక "సాల్మియాలో మా చిన్నాన్న వుంటాడు. ఆయన ఇండియాకు పోతుంటే విమానం ఎక్కించడానికి ఎయిర్పోర్ట్ కు వెళ్ళాడు" అని ఏదో అబద్ధం చెప్పింది భాగ్య.

ఆ రాత్రంతా కళ్ళు వాచిపోయేలా ఎదురు చూసారు. చీమ చిటుక్కుమన్నా వాడే వచ్చాడనుకుని భ్రమ పడ్డారు. కానీ వేణు ఇంటికి రాలేదు.

భాగ్య భయంతో వణికి పోతోంది. సుబ్బలక్ష్మికి కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. తేడా వస్తే బాబా అందరినీ చంపి పారేస్తాడు. అక్కడికీ వేణుకు స్నేహితులు అని తెలిసిన వాళ్ళందరికీ ఫోన్ చేసి అడిగారు.

ఎక్కడా వాడి జాడ తెలియలేదు. రాత్రి భయంగా కరుగుతోంది.

"ఊళ్ళో వాడు దొంగతనాలు కూడా చేసే వాడంట. అమ్మాయిలను ఏడిపించేవాడంట. రెండుసార్లు పోలీసులు పట్టుకుని చితక్కొట్టారట. అందుకే మీ మేనమామ వాడిని ఇక్కడికి పంపించాడు. ఇప్పుడు మన ప్రాణం మీదికి

వచ్చింది. ఇక్కడ కువైట్ లో ఎంతో భయంగా పని చేసుకుని బతుకుతాడు, మనకు చెడ్డ పేరు రాకుండా పద్ధతిగా వుంటాడు, అనుకున్నాము కానీ ఇంత పోకిరీ వెధవ అనుకోలేదు. ఇదేమైనా మన ఊరా, మన దేశమా, మన ఇల్లా..? మనం కువైట్ ఇంట్లో పని మనుషులము. ఇప్పుడు ఈ పరిస్థితిని ఎలా దాటడం. ఇప్పుడు వాడు ఏమయ్యాడో ఏమో. చేయరాని పనులు ఏమి చేసాడో. మన పని గోవిందా" అంటూ ఏడ్చింది సుబ్బలక్ష్మి.

"సరే ఏడ్వకు. మన తప్పేముంది చెప్పు" అని సర్ది చెప్పింది భాగ్య.

తెలవారుతుండగా ఇద్దరు అలసటతో అలా పది నిముషాలు కన్ను మూసారో లేదో ఉదయాన్నే ఎవరో వచ్చి అదేపనిగా ఆపకుండా కాలింగ్ బెల్ నొక్కుతున్నారు.

వీళ్ళిద్దరితో పాటూ మామా బాబా కూడా నిద్రలేచి కళ్ళు నులుముకుంటూ బయటికి వచ్చారు.

గేటు బయట పోలీసులు నిలబడి "బాబా ఖాలిద్ ఎవరు" అని అడిగారు.

"నేనే సార్. ఏం కావాలి" అన్నాడు బాబా.

"నువ్వే కావాలి. నీ ఆడి కార్లో సారాయి సీసాలు దొరికాయి.

నీ ఇద్దరు పనిమనుషులు సారా కాచి ఇస్తుంటే నీ డ్రైవర్ తో చెప్పి నువ్వే అమ్మి సొమ్ము చేసుకుంటున్నావట కదా. మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాం అందరూ పదండి స్టేషన్ కి" అన్నారు పోలీసులు.

నివ్వెరపోయాడు బాబా. ఏమీ అర్ధం కాక ఇద్దరు పని మనుషుల వైపు అయోమయంగా చూసాడు.

నోట మాట రాలేదు ఇద్దరికీ. వణికి పోతున్నారు.

"ఏం చేసారు మీరు.. ఏంటిది సారాయి కాచడం ఏంటి..?" అడిగాడు కోపంగా.

"మాకేమీ తెలియదు బాబా" అన్నారు ఇద్దరూ దీనంగా.

"అన్ని విషయాలు స్టేషన్లో మాట్లాడదాం పదండి" అంటూ తీసుకెళ్ళారు పోలీసులు.

ఆల్కహాల్ నిషేధించబడిన కువైట్ దేశంలో ఎవరైనా సారా కాచినా, అమ్మినా, కొనినా, తాగినా.. అందుకు పడే శిక్షలు తీవ్రంగా వుంటాయి. కానీ ఇక్కడ నుండి వెళ్ళిన మన వాళ్ళు వడ్డీ వ్యాపారాలు, వీసా వ్యాపారాలు, చీటీలు వెయ్యడం, సారా కాచడం, లంచం ఇవ్వడం, ఫ్లాట్లను విడగొట్టి బాడుగలకు ఇవ్వడం లాంటి ఎన్నో అసాంఘిక కార్యక్రమాలకు తెర తీసారు. వీరి స్వార్ధానికి, డబ్బు ఆశకు ఆ దేశాన్ని, ఆ వాతావరణాన్ని కూడా కలుషితం చేస్తున్నారు. డబ్బు సంపాదన వీరి ప్రధానోద్దేశం. అంతే.

ఏదో ఒకటి చేసి డబ్బు సంపాదించాలి. తొందరగా కోటీశ్వరులై పోవాలి. అందుకై అక్కడి చట్టానికి కూడా వీరు భయపడటం లేదు. కఠినమైన శిక్షలకు కూడా భయపడకుండా ప్రాణాలకు తెగిస్తున్నారు. ఇదెంతో విచారించే

విషయం. ఏ ఒక్కడి స్వార్థానికో ఇందులో చిక్కుకున్న అమాయకులు కూడా బలయి పరాయి దేశంలో జైలు పాలవుతున్నారు. బతుకును సర్వనాశనం చేసుకుంటున్నారు. కటకటాల వెనక చిక్కి జీవితాన్ని ఆ పరదేశంలోనే ముగిస్తున్నారు. ఇప్పుడు వేణు చేసిన తప్పుకు వీళ్ళందరూ చిక్కిపోయారు.

వాడు కేసును నిర్వీర్యం చేయడానికి తెలివిగా బాబాను, భాగ్యను, సుబ్బలక్ష్మిని కూడా ఈ ఊబిలోకి లాగాడు.

బాబా కువైటీ కాబట్టి ఏదో చెప్పి తప్పించుకోవచ్చు. కానీ అమాయకులైన ఇద్దరు స్త్రీల గోడు వినే వాళ్ళెవరు..?

"వీడికి మేలుచేసినందుకు మనకు తగిన శాస్తి జరుగుతోంది. పాముకు పాలుపోసి పెంచాము ఇప్పుడు విషాన్ని మనమీదే కక్కింది. ఏం చేద్దాం" అంటూ బాధ పడ్డారిద్దరూ.

ఎంత బాధపడి ఏం లాభం. పరదేశంలో ఒక్కసారి సమస్యల్లో ఇరుక్కున్నాక అమ్మా అంటే వచ్చి రక్షిస్తుందా. అబ్బా అంటే తండ్రి వచ్చి కాపాడతాడా. నిస్సహాయంగా పోలీస్ స్టేషన్లో చిక్కుకుపోయారు .

వాడు మాత్రం పోలీసులచేత తన్నులు తింటూ కూడా ధీమాగానే వున్నాడు. కోపం ఆపుకోలేక

"ఇంతపని చేసావు కదరా పొరంబోకు వెధవా. నీ పాపానికి నువ్వు శిక్ష అనుభవించకుండా మమ్మల్ని ఎందుకు ఇరికించావురా దౌర్భాగ్యుడా" అని సుబ్బలక్ష్మి వేణును తిట్టింది.

వాడు విలాసంగా నవ్వాడు.

"సారా వ్యాపారం చేసి ఇప్పటికే డెబ్భై లక్షలు సంపాదించాను. అంతా మా నాన్నకు పంపించేసాను. ఏమవుతుంది. కాదంటే నాలుగేళ్ళు జైల్లో పెడతారు అంతే కదా. తరువాత ఇంటికి వెళ్ళిపోతాను. ఆ డెబ్భై లక్షలు చాలు ఇండియాలో బతకడానికి అన్నాడు."

వళ్ళు మండింది భాగ్యకు. "మనిషి జన్మ ఎత్తి ఎట్ల పుట్టావురా" అని మొహమ్మీద ఊసింది.

ఎన్ని అనుకుంటే ఏం లాభం. బాబాకు కూడా కోపం నషాళానికి అంటింది.

ఆయనకు ఇందులో ఏ సంబంధం లేదని నిరూపించుకుని చక్కా ఇంటికి పోయాడు.

"బాబా మాకేమీ తెలియదు. మమ్మల్ని విడిపించు" అని భాగ్య, సుబ్బలక్ష్మి ఇద్దరూ ప్రాథేయపడ్డారు.

కానీ ఆయన "మీకు వాడెవడో తెలియకుండానే వాడిని ఇండియానుండి రప్పించారా.

ఇక్కడ మీకు తెలియకుండానే ఇంత సారా వ్యాపారం జరిగిందా..?

మీరందరూ నన్ను మోసం చేసినందు తగిన శిక్షను అనుభవించండి" అని తిట్టాడు.

పాపం అమాయకురాళ్ళు ఇద్దరూ చేయని తప్పుకు ఐదేళ్ళ కాలం వాడితో పాటూ కువైట్ జైల్లో కటకటాలు లెక్క పెట్టారు.

వాడికి మంచి చేసినందుకు వీళ్ళకు చెడు ఎదురయింది. ఊళ్ళో కూడా ఆ నోటా ఈ నోటా ఈ విషయం అందరికీ

తెలిసి బుగ్గలు నొక్కుకున్నారు. ఇద్దరు స్త్రీలకు కూడా సారా వ్యాపారంలో సంబంధం వుందనీ, డబ్బు కోసం పరాయి దేశంలో ఇలాంటి చెడుపనులు చేసి ముగ్గురూ జైలు పాలయ్యారని, వాడంటే మగపిల్లాడు బుద్ధిలేదు ఈ ఆడోళ్ళకేమయింది బుద్ధి అని చెప్పుకున్నారు.

నరంలేని నాలుకలు అంతే మరి. ఐదేళ్ళ తరువాత శిక్ష అనుభవించి అతికష్టం మీద ఇండియాకు తిరిగి వచ్చిన భాగ్యకు, సుబ్బలక్ష్మి కి ఆ ఊళ్ళో విలువే లేకుండా పోయింది. పాపం.. మంచి చేసినోళ్ళకి చెడు ఎదురయింది. చేయని తప్పుకు శిక్ష పడింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments